పెళ్ళికి ముందే
శీలం కోల్పోయిన
భార్యను
అతను ఎలా
స్వీకరించాడు?

# రసరాజు కథ

వెండి కత్తెర

బీచ్ సందడిగా ఉంది.

అందులో వేసవి కాలం—

పైగా సాయంత్రం—

కడలిలోంచి ఉవ్వెత్తున పైకి లేస్తున్నాయి కెరటాలు.

జంట జంటలుగా నడుస్తున్నారు కొందరు...

కడలి కడపులో బడబాలనలం ఎక్కడ దాగుందో తెలీదు.

ఏదో పోగొట్టుకొన్న వాళ్ళలా— ఏకాంతంగా నడుస్తున్నారు మరి కొందరు...

పిల్లలు సరే సరి— కేరింతలు కొట్టుకుంటూ ఇసుకలో అనాయాసంగా అటూ ఇటూ పరిగెడుతున్నారు.

'ఫిష్ ఫ్రై తీసికొందామా....''

మీ ఇష్టం అన్నట్లు కళ్ళలోకి చూసింది మేనక.

సుందరం నాలుగు పీసెస్ పేక్ చేయించాడు.

''ఎప్పుడైనా గుర్రమెక్కావా మేనూ...''

''లేదు...'

సుందరం గుర్రం వాలాను పిల్చాడు.

''అబ్బే! బావుండదండి....'' మేనక సిగ్గు పడింది.

''ఫర్వాలేదు.. ఆ చివరికి పోదాం.... అక్కడంతగా జనం ఉండరు...''

''అయితే నడిచే పోదాం... గుర్రమెందుకు?..'

'ఇసుకలో నువ్వు నడవలేవులే.... అయినా అదో థ్రిల్!... కాపరానికి కొత్తగా



వచ్చావు... తర్వాత ఈ సర్దాలు ఎలాగూ ఉండవు" సుందరం మేనక, సుదూరంగా వెళ్ళి అక్కడ గుర్రం దిగేరు.

నిజానికి జనం అక్కడ అంత మాత్రంగానే ఉన్నారు. అక్కడో బోర్లించిన నావ కనిపించింది. ఇద్దరూ దాని పక్కగా కూర్చున్నారు. మేనకకు సముద్రం చూడటం ఇదే మొదటి సారి.

ఆసక్తిగా అలాగే ఆలోచిస్తూ కూర్చుంది.

"సముద్రాన్ని చూడటం ఇదే మొదటిసారి... మేనక దూరంగా లంగరేసిన ఓడకేసి చూస్తూ అంది.

"అయితే సముద్రాన్ని చూస్తే నీకేమనిపిస్తుంది?.."

"ఏముంది?... అనంత విశ్వం ముందు మనమెంత అనిపిస్తుంది..."

"మొత్తం మీద ఫిలాసఫీ స్టూడెంట్ అనిపించుకొన్నావు..."

"చూడండి ఆ హోరు..."

"సర్లే... సర్వం మర్చిపోయేలా ఉన్నావు... ఈ పీస్ తీస్కో" నోటి కందించాడు సుందరం.

"ఎలా ఉంది?..."

"అంత బాగా లేదు..."

....

....

మేనక ఒళ్ళో తలపెట్టి సుందరం ఆమెకేసి కన్నార్పకుండా చూస్తున్నాడు.

ఎర్రటి ముఖం....

విశాలంగా ఉన్న నేత్రాలు...

నవ్వినప్పుడల్లా సొట్టపడే గులాబీ రంగు బుగ్గలు..

"ఎంతటి అదృష్టవంతుణ్ణో..." సుందరం మురిసిపోయాడు తనలో తాను.

"ఎమిటి? అంత అలా ఆలోచిస్తున్నారు రెప్పవేయకుండా..."

"నీ అందాన్ని..."

"అంత బావున్నానా..."

"రియల్లీ.." బుగ్గ మీద చిటికేశాడ సుందరం.

"వెన్నెల రాత్రి... మరి కాస్సేపట్లో ఈ పగటి వెలుగుండదు.. ఎక్కువ సేపు ఇక్కడే గడిపిపోదాం.. ఏమంటావ్?"

"పొద్దుపోతే బుద్ధి మారుతుంది.. మీ మగాళ్ళకు సమయం సందర్భం అంటూ ఉండవు బాబూ..."

"అసలు నిన్ను తీసుకొచ్చింది ఎందుకని?..."

"ఎందుకట?..."

"అందుకే?..."

"ఛీ! ఊరుకోండి..."

"ఎన్ని ప్రేమ పక్షులిక్కడికి వలస వస్తుంటాయో నీకేం తెల్సు మేనూ... రకరకాల అనుభూతులనుకో సంసారం చేస్తూ కొంత మంది... పెళ్ళి కాకుండా మరి కొంతమంది... నీలాంటి అరుదైన అందమైన ఆడ పిల్లలు..." అంటూ మధ్యలో ఆగిపోయాడు సుందరం.

అతనిలో ఏదో ఆలోచన....

ఆ ఆలోచన అతనికి చాలా అసభ్యమనిపించింది.

"ఏమిటి?.... ముఖం అలా ప్రశ్నార్థకంగా పెట్టారు?" మేనక అడిగింది.

"ఏవీ లేదు...'

"ఏదో దాస్తున్నారు! చెప్పండి..."

"ఏవీ లేదు మేనూ.. చదువుకొన్న వాళ్ళం. ... మన అనుభవాన్ని మనం చెప్పుకోవటంలో తప్పు లేదు. అవి చేదుగానూ ఉండొచ్చు లేదూ మధురాతి మధురంగానూ ఉండొచ్చు...'

మీ భావం నా కర్థం కావడం లేదు...''

''నువ్వు ఏవీ అనుకోనంటే...''

''అనుకోను.. చెప్పండి...''

''నా సాక్షిగా నువ్వు నిజం చెప్పాలి.. ఎవర్ని ఎవరూ మోసగించుకోవలసిన పని లేదు.. సరదగా అనుభవాలు చెప్పుకొందాం.... దట్సాల్...''

''అనుభవాలంటే...''

''ఐ మీన్... తెలిసో తెలియకో ప్రేమలోనో ... లేక.... ఆ అనుభవంలోనో చిక్కుకోవడం వంటిది...''

మేనక ఒక్కసారిగా అదిరిపడింది.

ఊహించని మలుపు...

పిడుగు పాటు లాటి ఆలోచన...

''ఛ! అవేం ప్రశ్నలండీ...''

''అందుకే ముందుచెప్పా... కాదూ కూడదని పట్టుపట్టావ్.... నువ్వు బాధపడతావని నాకు ముందే తెలుసు...'

''అసలు భార్యాభర్తల మధ్య ఇటువంటి భావాలే తలెత్తకూడదండీ.. మరి మీకెందుకు ఆ ఆలోచన కలిగిందో నాకు తెలీదు...''

మేనక ముఖంపై ముచ్చెమటలు పోశాయి.

''జస్ట్... ఎందుకో అనుకోకుండా కలిగిందా భావం... పొరపాటే... బయట ప్రపంచంలో ఎక్కువగా తిరిగిన వాళ్ళం కదా... సహజంగా ఏవో అనుభవాలు మనకూ ఉండకపోతాయా అవి అడిగా... అంతే!''

మేనకలో మౌనం...

''ఈ సముద్రం సాక్షిగా చెబుతున్నా నేనూ... నాకు అలాటి అనుభవాలంటూ లేవు... అయితే ఓసారి పోస్టు గ్రాడ్యుయేషన్లో ఉన్నప్పుడు మాత్రం ఓ అమ్మాయి అదేపనిగా నాకు ప్రేమలేఖలు వ్రాస్తుండేది. అసమర్థుడ్ని.. సాహసించి అడుగేయలేకపోయాను... అది మినహా...''

మేనక వింటూ కూర్చుంది.

ఆమె హృదయసముద్రం అప్పటికే అల్లకల్లోలంగా ఉంది.

సుందరం తనను మరి కాస్సేపట్లో ప్రశ్నిస్తాడని తనకెలాగూ తెలుసు... సమాధానం చెప్పి తీరాలి... ఎలా? పైగా తన సాక్షిగా చెప్పాలట... సుందరం తన సర్వస్వం.. తనను ఆరాధ్య దేవతగా పూజించే ప్రేమ పూజారి...

''నువ్వెప్పుడైనా... ఏ అనుభవమైనా...''

సుదరం అడగవలసింది అడిగేశాడు.

'అంత అందకత్తెను చూపి ఇంతవరకు



పిసినారి

''లిఫ్ట్ కూడా కట్టగూడదూ?'' నాలుగంతస్థుల భవనాన్ని కట్టి అద్దెకిచ్చిన పిసినారి పినాకపాణిని అడిగాడు రేవంత్.

''లిఫ్ట్ కట్టే స్థలమే ఉంటే... అంతస్థుకు మరో గది ఎక్కువ కట్టి... అద్దెకిచ్చేవాడ్ని కదయ్యా?'' టక్కున బదులిచ్చాడు పినాకపాణి.

జోకర్ (హైదరాబాద్)

ఈ ప్రపంచం ఊరుకుందా..'' అదీ అతనిలో బాధ అనుమానం.

''మనం చదువుకొన్న వాళ్ళం.... ఇటు వంటి ప్రశ్నలే రాకూడదండీ!...'' అలా అంటూ ఒక్కసారిగా అలసటకులోనయింది మేనక.

''ఏమయింది?..'' సుందరం ఆత్రంగా అడిగాడు.

''తలనొప్పిగా ఉంది...''

''అయితే ఇంటికిపోదాం...''సుందరం పైకి లేచాడు బాధగా.

''లేనిపోని కల్లోలాన్ని సృష్టించావే.. ఆమె విషయంలో నిజంగా అటువంటిదే జరిగితే నేను భరించగలనా!... చదువుకొన్న మూర్ఖత్వం అంటే ఇదేనేమో!... '' తనలో తాను బాధ పడ్డాడు సుందరం.

మేనక నిస్తేజంగా పైకి లేచింది.

ఇసులో ఇద్దరి అడుగులూ బరువుగా బాధగా కదిలాయి.

* * *

రెండు రోజులు గడిచిపోయాయి.

మేనక బాగానే ఉంది— శారీరకంగా.

సుందరాన్ని చూసినప్పుడల్లా ఆమె గుండె ఎందుకో దడ దడ లాడుతోంది.

సుందరానికి అంతే— మేనక కనిపించినప్పుడల్లా— ఏదో అసహనం అతని అంతరాంతరాల్లో పెల్లుబుకుతోంది. ఆమె సమక్షంలో అతను అంత ఫ్రీగా తిరగలేకపోతున్నాడు. పైకి మాత్రం ఇద్దరూ మామూలుగానే ఉంటున్నారు. అయినా ఇద్దరి మధ్య నేపథ్యంలో ఏదో ఇనుప తెర...

ఆ రాత్రి మళ్ళీ అడిగాడు సుందరం ఉండబట్టలేక.

తన సాక్షిగా చెప్పమని పట్టుబట్టాడు. ఆమె వెనుక దాగి ఉన్న చరిత్రనేదో తెలిసికోవాలని అతని మనస్సు అనుక్షణం ఆరాటపడిపోతోంది.

''నన్ను మన్నిం...'' ఏదో చెప్పబోయింది కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతు గాద్గదికమయింది...

సుందరం ఊపిరిబిగపట్టి మేనక పెదవులపై త్రుళ్ళిపడే మాటల్ని వినే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాడు.

''అలాంటిదేమీ జరగలేదు..'' ఆమె కంఠం భయం భయంగా వణికింది.

మరి కాస్సేపటికి అతని ఒళ్ళో ఆమె ఒరిగిపోయింది నిస్తేజంగా.

ఆ రాత్రి సుందరం— ఆమెను హాస్పిటల్లో చేర్పించాడు.

* * *

మేనక నెల రోజుల్లో మామూలు మనిషయింది.

మనసు మాత్రం భయాందోళనల మధ్య బిక్కు బిక్కుమంటూనే ఉంది.

ఆ రాత్రి —

మేనక ప్రక్కనే సుందరం పడుకొంటూ మళ్ళీ ఆ విషయాన్ని లేవ నెత్తాడు.

సమస్య పాతదే అయినా ఆ మాట వినగానే మేనక మళ్ళీ త్రుళ్ళిపడింది.

'ఎక్కడో గాయపడ్డట్లే నీ ముఖం, చెబుతోంది. నీ తొట్రుపాటు అలానే ఉంది... నేనేమీ అనుకోను... అబద్ధం చెప్పి

నిన్ను నీవు మోసగించుకోవద్దు... నీ విషయంలో ఏం జరిగినా సహిస్తాను. నిర్భయంగా జరిగిందేమిటో చెప్పెయ్..."

సుందరం పట్టుబట్టాడు.

మేనక నిస్సహాయురాలయిపోయింది.

ఎప్పుడో ఒకప్పుడు ఈ విషయం సుందరానికి తెలీకుండా పోదు. అది కూడా తన నోటితో తనే చెప్పాల్సి ఉంటుంది. అయినప్పుడు ఎందుకీ దాపరికం?....

జరిగేదేదో జరక్క మానదు.

మేనక భయంభయంగా గతంలోకి వెళ్ళింది.

* * *

ఆగష్టు పదిహేను.

ముందు నాయనమ్మ—

వెనుక మేనక—

ఇద్దరూ సన్నగా ఉన్న ఆ కాలిబాటపై నడుస్తున్నారు.

అటూ ఇటూ దట్టంగా ఉన్న పిచ్చి మొక్కలు—

మధ్య మధ్య ముళ్ళ పొదలు—

రేవు దాటటానికెళ్ళే ప్రయాణికులు ముందు చాలా దూరంలో ఉన్నారు.

వెనుక ఎవరూ కనపడటం లేదు.

కోడేరులో ఉన్న నీలిమ పెళ్ళికి— నాయనమ్మతో బయల్దేరింది మేనక.

క్రమంగా కనుచీకటి పడింది.

బండార్లంకలో ఇంటి నుంచి బయల్దేరేటప్పటికే సాయంత్రం అయిదుంబావయింది.

కాలి బాట మసక మసగ్గా కాస్త నల్లగా వంకర్లు తిరిగిన కోడె త్రాచులా ఉంది.

మేనక ఓ సారి నిలబడి చుట్టు ప్రక్కలకు పరిశీలనగా చూసింది.

ఎవరూ ఎక్కడా కనపడలేదు.

"చీకటి పడితే గోదావరిలో నావలుండవేమో.. తొందరగా పోవాలి.. "

నాయనమ్మ కంగారుపడింది.

నడకలో వేగం పెంచింది మేనక.


కాళ్ళకున్న కొత్త పట్టాల మువ్వలు కూడా— అంత వేగంగానూ మధురంగా గలగలమన్నాయి.

రేవు దగ్గర పడటానికి ఇంకా మైలు దూరంపోవాలి.

ఇంతలో అనుకోని సంఘటన—

నాయనమ్మ నోరు నొక్కి దూరంగా

## శునక మాంసాహారులు



కొరియాలోని సియోల్ ప్రజలకు కుక్కమాంసం, నాగపాముసూప్ ఇప్పటికీ ఇష్టమైన వంట కాలేనట! ఒలింపిక్స్ సందర్భంగా ప్రజల ఆహారపు అలవాట్లను పరిశుభ్రంగా చేద్దామని ఆ దేశ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా... ఫలితం లేదట!

ఓ ప్లేట్ కుక్కమాంసం తింటే అంతకు మించిన మహాభాగ్యం ఏముంటుందంటున్నారు కొరియన్‌లు! అందుకే అంటారు ఎవరి పిచ్చి వారికానందం అని.'

—జూపిటర్

తీసుకుపోయాడు ఎవరో ఓ అగంతకుడు.

మరో బలమైన యువకుడు కత్తి చూపించి మేనకను రాక్షసంగా పొదల్లోకి లాక్కుపోయి...

అదొక చీకటి కథ!

ఆ చీకటి కథ మేనకకూ నాయనమ్మకూ తప్ప మరెవరికీ తెలియదు.

సంప్రదాయం గోడల మధ్య— ఆ రహస్యం అలానే ఉండిపోయింది.

* * *

సుందరం ఆశ్చర్యపోయాడు. ఆమె "గతం" తెలుసుకొన్నాక మౌనంగా ఉండిపోయాడు కాసేపు.

బరువుగా నిట్టూర్చాడు...

తడారిపోయిన పెదవులపై నుంచి ఒక్క మాట కూడా బయటకు రాలేదు.

ఎదురుగా మేనక—

పిట్టలా వణికిపోతోంది.

ప్రతిధ్వని ఎలా ఉంటుందో ఆమె ఊహించుకోలేకపోతోంది.

సుందరం మనస్సు తనకు బాగా తెలుసు.

అయితే ఇటువంటి విషయాల్లో — అవతలి వ్యక్తిలో సంస్కారం చచ్చిపోతుందని కూడా తనకు బాగా తెలుసు.

మేనక తలొంచుకుని భయం భయంగా ఊపిరి పీల్చుకుంటోంది.

సుందరం ఆమెకు దగ్గరగా వచ్చి ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు.

తన కళ్ళల్లోకి ఓ సారి చూడమన్నాడు.

ఆమె చూసింది. బరువుగా బాధగా సిగ్గుగా... సుందరం కళ్ళల్లో ఉట్టిపడే సౌజన్యాన్ని ఆమె దర్శించింది.

అతనిలో ఎదిగిన క్షమాదృష్టి ఆమెను ఒక్కసారిగా కదిలించివేసింది.

"నా పాత జీవితం నీకనవసరం... అలాగే నీ గతం కూడా నాకు అనవసరం.. అది కూడా నీకు తెలిసి జరిగింది ఎంత మాత్రం కాదు.. నేను నిన్ను హృదయ పూర్వకంగా ప్రేమిస్తున్నాను. విశ్వసిస్తున్నాను... సమాజం చేసిన తప్పుకు నువ్వు దోషివి కాకూడదు... అందుకే నిన్ను మనసారా అందులోనూ నిజం చెప్పినందుకు మరింతగా నిన్ను అభిమానిస్తున్నాను.. అప్పుడు ఇప్పుడూ ఎప్పుడూ నువ్వు నాదానివే! బిలీవ్ మి! ఆ చరిత్ర మర్చిపో.. నేనూ మర్చిపోతున్నాను...."

మేనక సుందరం కాళ్ళ మీద పడిపోయింది.

అతని పాదాలు ఆమె కన్నీళ్ళతో పూర్తిగా తడిసిపోయాయి.

సుందరం ఆమెను లేవదీసి గాఢంగా గుండెలకు హత్తుకొన్నాడు.

* * *

మేనక సుందరం దగ్గర ప్రాంతాల వాళ్ళు.

పాత బంధుత్వం లేదు కాని పిల్ల బాగుంటుందని సుందరం మోజుపడి పెళ్ళి చేసుకున్నాడు.

సుందరం ఆర్థికంగా బలపడిన వ్యక్తి మంచి అందగాడు...

ఇవన్నీ తన అదృష్టంగా భావిస్తుంది మేనక.

నిజం చెప్పాలంటే మేనక దృష్టిలో

సుందరం ఒక దేవుడు.... ఒక ఆదర్శ పురుషుడు.

అతనిలో ఉన్న ఆ సౌజన్యం ఆ సహనం పెళ్ళినాడే తనను ఆకట్టుకున్నాయి. ఆ ఆదర్శరం ఎంత మంది కుంటుందీ సమాజంలో?... భర్త తప్పు చేస్తే భార్య మన్నిస్తూనే ఉంది అనాదిగా. ఎందుకు? మగాడు కనుక...

అదే భార్య చేస్తే ఏ భర్త సహించాడీ లోకంలో? ఎందుకు?... మగాడు కనుకనే...

తన భర్త మగాడే!

అయితే మగాళ్లకే మగాడు!

పెళ్ళి కాకముందే తన శీలం పాడైపోయిందని చెప్పినా గుండెలకు హత్తుకొన్నాడు.

ఎంత అమాయకుడు?...

అందుకే సుందరం తనకు ఆరో ప్రాణం.

* * *

మేనక అమాయకంగా నిద్రపోతోంది.

సుందరం ఇంకా మెలకువగానే ఉన్నాడు. అతని చేతిలో పాత డైరీ ఉంది.

"ఆగస్టు పదిహేను...

చీకటి... ఎవరో ఓ అమ్మాయి కోడేరు వైపు నడుస్తోంది.. ఆమె ముందు మరో ఆకారం.. ఆ ఆకారం అరవకుండా సుబ్బన్న జాగ్రత్త పడ్డాడు. అంతే నాలో రాక్షసుడు ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు... అదే నా తొలి అనుభవం..."

సుందరం కళ్ళు డైరీలోంచి తప్పుకొని మేనక వంక చూశాయి.

మేనక అందంగా అమాయకంగా నిద్రపోతోంది.

* * *

